TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 159 | బుధవారం 03-06-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

# తెలంగాణ కోటి రత్నాలవీణ

- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- •నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం
- తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి
- కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి వెల్లడి
- ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్
- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ







తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. పేజి 2లో ▶



## చీలిక దిశగా మమత పార్టీ: బెంగాల్ మంత్రి వ్యాఖ్యలు

తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలడానికి సిద్ధంగా ఉందని పశ్చిమ బెంగాల్ మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కనిపించిన పరిస్థితులే ఇక్కడా రానున్నాయన్నారు. ఆ రాష్ట్రంలో శివసేన పార్టీ రెండు ముక్కలైన సంగతి తెలిసిందే. పార్టీ గుర్తు విషయంలోనూ వివాదం నడిచింది. దానిని ఉద్దేశించే మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యం లేనివారికి టీఎంసీ చోటు కల్పించిందని.. అందుకే ఇప్పుడు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి బయటపడుతోందన్నారు. టీఎంసీ విచ్ఛిన్నదిశగా ఉందని, చివరకు రాజకీయరంగం నుంచి కనుమరుగవుతుందన్నారు. ఈ నేత 2024లో తృణమూల్ కాంగ్రెస్ నుంచి భాజపాలో చేరారు. పేజి 2లో ▶

## మోదీ రాసిచ్చారు.. పవన్ చదివారు: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పందించారు. పవన్ వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. తెలివితక్కువ మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. కాంగ్రెస్, జనసేన కలిసి నాటకాలాడుతున్నాయన్న ఆయన.. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని డ్రామాలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు. మోదీ రాసిచ్చారు.. పవన్‌కల్యాణ్ చదివారంటూ జగదీశ్ రెడ్డి ఆరోపించారు.

## రష్యాలో మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రష్యా రాజధాని మాస్కో నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేశ్ గిరి, ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 7 వరకు లోకేశ్ రష్యాలో పర్యటించనున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌లో ఆయన పాల్గొననున్నారు.



## మీ ఇష్టానికి మాట్లాడితే నేను భయపడాలా? : పవన్

- తెలంగాణపై తనకు ఎంతో ప్రేమ ఉందని, అది రాజకీయాలకు అతీతమైందని తెలిపారు.
- హైదరాబాద్‌లో అడుగు పెట్టొద్దంటూ బెదిరించడం సరికాదని, తాను బెదిరింపులకు భయపడనని స్పష్టం చేశారు.
- తెలంగాణ ప్రజలు ఎప్పుడూ తనకు అండగా నిలిచారని, జనసేన పార్టీని కూడా తెలంగాణలోనే స్థాపించామని గుర్తు చేశారు.
- తనకు అధికారంపై కాదు, మార్పుపైనే ప్రేమ ఉందని చెప్పారు.
- తెలంగాణ ప్రజలకు ఆంధ్రాపై విద్వేషం లేదని, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించవద్దని సూచించారు.



హైదరాబాద్: తెలంగాణపై తనకు ఎంతో ప్రేమ ఉందని, అది రాజకీయాలకు అతీతమైందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ ప్రజలు తనకు ఎన్నోసార్లు అండగా నిలిచారన్నారు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడిన పవన్.. తనను బెదిరించేలా మాట్లాడుతున్న వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పేజి 2లో ▶

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

- పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్



## గుడ్‌న్యూస్..

### 290 పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివిధ శాఖల్లో 290 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. రోడ్లు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్, 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్ పోస్టులకు ఈ నెల 6 నుంచి జులై 13 వరకు; అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పోస్టులకు ఈ నెల 8 నుంచి జులై 15వరకు; పీసీబీలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 10 నుంచి జులై 17వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. పూర్తి నోటిఫికేషన్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని టీజీపీఎస్సీ కార్యదర్శి ఎం.హరిత ఓ ప్రకటనలో తెలిపారు.

## యశ్వంత్‌పుర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో తప్పిన ప్రమాదం



## రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి

ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తాం తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మంత్రి పొన్నం



# సంపాదకీయం

## వలసలకు మతం ఎక్కడిది?

ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఇప్పుడు ఒక నినాదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రధానపార్టీల్లో కొన్ని ఆ నినాదం చుట్టూనే రాజకీయాలను నడుపుతున్నాయి. ప్రజల్లో ఉద్వేగాలనూ శత్రుత్వ భావనలనూ రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జనాకర్షక నాయకులందరూ ఆ నినాదమంత్రాన్నే జపించారు. అధికార పీఠాన్ని అందుకోటానికి తహతహలాడుతున్న నేతలూ అదే అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమికొడతామన్నదే ఆ నినాదం. వ్యక్తీకరణలో ఎన్ని తేడాలైనా ఉండొచ్చు.. కానీ సారాంశంలో మాత్రం వలసదారుల లక్ష్యంగానే రాజకీయ ప్రచారం ఊపందుకుంటోంది. దీనికి ఏ ప్రజాస్వామ్యదేశమూ మినహాయింపు కాదు. అన్ని ప్రజాస్వామ్యదేశాలకూ బయట నుంచి వచ్చే వలసల సమస్య తీవ్రమవుతూ ఉంది. దీన్ని కాదనలేం. ఉద్యోగాలు, ఉపాధికోసం వచ్చే సక్రమ వలసలను బాగా తగ్గించాలనే డిమాండు ఒకవైపు ఉంటే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలనే లక్ష్యం కొన్నిచోట్ల విపరీత పోకడలు పోతోంది. అమానవీయంగా తయారవుతోంది. ఇటీవల జరిగిన బెంగాల్, అసాం అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమ వలసల సమస్యే బీజేపీకీ ప్రధాన ప్రచార ఆయుధంగా మారింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తోన్న ముస్లింలతో బెంగాల్, అసాంల్లో జనాభా ముఖచిత్రం మారిపోతోందన్న ప్రచారానికే అది పరిమితం అవ్వలేదు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోకీ అక్రమ వలసదారులు చొచ్చుకుపోతున్నారనీ అనేకచోట్ల స్థానికుల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారనీ ఆరోపించింది. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోందనీ సాక్షాత్తూ కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోటానికి మే 26న ఒక ఉన్నత స్థాయి కమిటీని (హైలెవల్ కమిటీ ఆన్ డెమొగ్రాఫిక్ చేంజ్) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక సంవత్సరంలోపు నివేదికను ఇవ్వాలని ఆ కమిటీకి నిర్దేశించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రకాశ్ ప్రభాకర్ నావ్లేకర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఆ కమిటీలో మరో నలుగురు సభ్యులు ఉన్నారు. అందులో భారత జనగణన కమిషనర్ కూడా ఒకరు. విచిత్రం ఏమిటంటే కమిటీ చైర్మన్‌కు జనాభాలో వచ్చే అనేక రకాల మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసే డెమొగ్రఫీ వ్యవహారంతో అంతకుముందు పెద్దగా పరిచయం లేదు. మధ్యప్రదేశ్‌లో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న తనను ఉన్నతస్థాయి కమిటీకి చైర్మన్‌గా ప్రకటించటం ఆశ్చర్యం కలిగించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు 'ద హిందూ' పత్రిక పేర్కొంది. కమిటీలో ఉన్న మిగతా ముగ్గురు కూడా (జనగణన కమిషనర్ మినహా) జనాభా అధ్యయన శాస్త్రంలో జాతీయస్థాయిలోనూ అంత పేరు ప్రఖ్యాతులు ఉన్నవారేమీ కాదు.

పొట్టచేతపట్టుకుని సరిహద్దులను దాటుకుని వచ్చి కూలీనాలీ చేసుకోవటం ఈనాటి సమస్య కాదు. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ ఉంది. ఉమ్మడి బెంగాల్ రాష్ట్రం నుంచి అసాంలోకి ముస్లింల వలసలను బ్రిటిష్ పాలకులు బాగా ప్రోత్సహించారు. అంతకుముందు అసాం రాజులూ ఆ పనిని చేశారు. ఇక స్వాతంత్ర్యానంతరం తూర్పుబెంగాల్‌లో ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తం అయినప్పుడల్లా ఉపాధికోసం భారత భూభాగంలోకి ప్రజలు వలసలు రావటం సర్వసాధారణంగా మారింది. ఆ వలసలు బంగ్లాదేశ్ యుద్ధమప్పుడు ఇంకా ఉధృతం అయ్యాయి. ఆ తర్వాతా కొనసాగాయి. వలసలూ ఇతర కారణాలతో క్రమేపీ ముస్లిం జనాభా పెరగటం అసాం మధ్యతరగతిలో తీవ్ర అభద్రతా భావాన్ని సృష్టించింది. అసాం విద్యార్థుల సంఘం నేతృత్వంలో బెంగాలీయులకు వ్యతిరేకంగా అక్కడ ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమం ఎన్నో ఆటుపోట్లకు లోనైనా చివరకు వలసప్రజల విషయంలో ఒక ఒప్పందానికి దారితీసింది. 1985 ఆగస్టు 15న కుదిరిన ఆ ఒప్పందం ప్రకారం... 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలోకి ప్రవేశించిన వారందరినీ అక్రమ వలసదారులుగా ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి వాళ్ల పేర్లను తొలగించాలి. ఒప్పందం కుదిరి 40 ఏళ్లు గడిచిపోయింది. ఇప్పటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి నాటికి అసాంలో అర్హులైన పౌరులనూ వారి వారసులనూ గుర్తించి నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) నవీకరించటం 2019లోనే పూర్తయినా దాన్ని ఇంకా నోటిఫై చేయలేదు. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ట్రైబ్యునళ్లు, కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. అక్రమ వలసదారులందరూ ముస్లింలేనని విపరీతంగా ప్రచారం జరిగినా ఎన్ఆర్‌సీ కసరత్తులో అది నిజం కాదని తేలింది. ఎన్ఆర్‌సీలో చోటుదక్కని ప్రజల సంఖ్య 19.06 లక్షలని నిర్ధారించారు. దాని ప్రకారం అక్రమ వలసదారులు అసాంలో అంతమంది మాత్రమే ఉన్నట్లు లెక్క. మిగతా 3.11 కోట్ల మంది అసాం స్థానికులే. 1,600 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేసిన కసరత్తులో తేలిన నిజం అదే. అక్రమ వలసదారుల్లో ఏ మతం వారు ఎంతమంది ఉన్నారో ఎన్ఆర్‌సీ తుదిజాబితాలో అధికారికంగా పేర్కొనలేదు. అనధికారిక అంచనాల ప్రకారం హిందువులే ఆ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి హిందువులు వలసలు రావటం ఎప్పుడూ ఉంది. అన్ని పత్రాలూ పుచ్చుకుని వలసలు వచ్చే పరిస్థితి భారత ఉపఖండంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా లేదు. అక్రమ వలసదారుల్లో హిందువులు ఎక్కువగా ఉండటానికి ప్రధానకారణం బంగ్లాదేశ్‌లో వారి సంఖ్య గతంలోనూ ఇప్పటికీ అధికంగానే ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 1.3 కోట్ల మంది హిందువులు బంగ్లాదేశ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్ జనాభాలో హిందువుల శాతంలో తగ్గుదల ఉన్నా సంఖ్యాపరంగా చూస్తే పెరుగుదలే కనిపిస్తుంది.

1951లో 92 లక్షల హిందూ జనాభా ఉంటే, ఇప్పుడది 1.3 కోట్లు అయింది. అసాం ఒప్పందం ప్రకారం అక్రమ వలసదారులను మతపరంగా విభజించి చూడటానికి వీల్లేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలో కాలుపెట్టిన వాళ్లందరినీ అక్రమ వలసదారులుగానే భావించాలి. హిందువులకూ ముస్లింలకూ ఇదే సూత్రాన్ని వర్తింపచేయాలి. ఎన్ఆర్‌సీ ప్రకారం అక్రమ వలసదారుల్లో హిందువులు అధికంగా ఉన్నట్లు స్పష్టంగా తేలటంతో కేంద్ర ప్రభుత్వం అసాం ఒప్పందానికి విరుద్ధంగా అడుగులు వేసింది. ముస్లింలను పక్కనబెట్టి హిందువులకూ మరో అయిదు మతవర్గాల వారికి మాత్రమే పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ చట్టానికి సవరణను తీసుకువచ్చింది. ముస్లింలు తరలిపోటానికి చాలా దేశాలు ఉన్నాయనీ హిందువులకు అట్లాంటి అవకాశం లేదనీ వారికి ఉన్నదల్లా ఒక్క భారతేనన్న విచిత్ర వాదనతో చట్ట సవరణను సమర్థించుకుంది. ఒక్క ఇజ్రాయెల్ తప్ప ఏ దేశమూ మతం ఆధారంగా ఇతర దేశాల వారికి పౌరసత్వాన్ని కట్టబెట్టటానికి ఎప్పుడూ పూనుకోలేదు. ఇక భారత రాజ్యాంగ చరిత్రలో గతంలో ఎప్పుడూ మతపరమైన భేదభావాన్ని చూపిస్తూ చట్టానికి సవరణను తీసుకురావటమూ జరగలేదు. పౌరసత్వ చట్ట సవరణతో మరో కీలక మార్పునకూ కేంద్రం శ్రీకారం చుట్టింది. అసాం ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత వలసలు వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వకూడదు. పౌరసత్వ చట్టానికి తీసుకువచ్చిన సవరణ ప్రకారం, 2014 డిసెంబర్ 31 నాటికి దేశంలో అడుగుపెట్టిన హిందువులకూ ముస్లింయేతర ఇతర వర్గాలకూ దాన్ని ఇవ్వొచ్చు.

అక్రమంగా వలస వచ్చిన హిందువులందరికీ పౌరసత్వం కల్పించి ముస్లింలందరినీ బంగ్లాదేశ్ పంపించటం సాధ్యం అవుతుందా? అన్నదానికి ప్రభుత్వం దగ్గర జవాబులేదు. అసాం తరహాలోనే పశ్చిమబెంగాల్‌లో కూడా ఎన్ఆర్‌సీ కసరత్తుని ఆరంభించి పూర్తిచేస్తే అక్కడా పరిస్థితిలో మార్పు కనపడకపోవచ్చు. సరైన పత్రాల్లేని హిందువులు బెంగాల్‌లో కూడా పెద్దసంఖ్యలోనే తేలే అవకాశం ఉంది. గట్టిగా ప్రయత్నిస్తే వేలల్లో అక్రమ వలసదారులను బయటికి పంపొచ్చు. లక్షల మందిని అట్లా పంపటం సాధ్యం కాదు. భారత్‌లోని అక్రమ వలసదారులందరూ తమ దేశం నుంచి వెళ్లిన వారేనని బంగ్లాదేశ్ అంగీకరించటానికి సిద్ధంగా ఉంటేనే సమస్య పరిష్కారం అవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది అసాధ్యం.

## మీ ఇష్టానికి మాట్లాడితే నేను భయపడాలా? : పవన్

మొదటిపేజీ తరువాయి

**మీరెవరయ్యా.. నన్ను బెదిరించడానికి?**

"ఈ మధ్యన కొందరు నన్ను హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావ్.. ఇక్కడ నీకేం పని అని అడుగుతున్నారు. అసలు మీరెవరయ్యా నన్ను బెదిరించడానికి..? బెదిరించే వాళ్ల అయ్య జాగీరా.. తెలంగాణ. మీ ఇష్టానికి మాట్లాడితే నేను భయపడాలా? నాపై దాడులు చేస్తామంటున్నారు కదా..! అందుకే నా అడ్రస్ తెలియాలనే ఇంటి వద్దే ప్రెస్‌మీట్ పెట్టా. నాకు తెలంగాణలో బెదిరింపుల కన్నా ఆంధ్రాలోనే అధికం. తెలంగాణ యువతకు అద్భుతమైన అవకాశాలు రావాలని కోరుకొనే వ్యక్తిని నేను. ఆంధ్రాలో నన్ను తిరగనివ్వం అంటే వారాహి అనుమతి ఇచ్చింది తెలంగాణ ప్రజలే. నాకు ఎన్నో ఏళ్లుగా తెలంగాణ ప్రజలు అండగా నిలిచారు. జనసేనను తెలంగాణ నడిబొడ్డున ఏర్పాటు చేశాం"

**అధికారంపై ప్రేమ లేదు..**

"తెలంగాణలో పార్టీ బలోపేతం చేయాలని మా నేతలు చాలా సార్లు అడిగారు. ఆంధ్రాలోనే అధికారం కోరుకోని వాడిని. తెలంగాణలో అధికారం ఎందుకు కోరుతాను. నాకు అధికారంపై ప్రేమకాదు.. మార్పుపైనే ప్రేమ. తెలంగాణ ప్రజలకు ఆంధ్రాపై విద్వేషం లేదు. తెలంగాణ ప్రజలు ద్వేషం పెంచుకుంటే ఒక్క ఏపీ వ్యక్తి కూడా ఇక్కడ ఉండేవారు కాదు. తెలంగాణ నలుమూలల నుంచి తిరిగిన వ్యక్తిని.. ఇప్పుడు నన్ను విమర్శించేవాళ్లు ఆదిలాబాద్ అడవుల్లో తిరగలేదు.. నేను తిరిగాను"

**బెదిరింపులకు లొంగే వాడిని కాదు..**

"నేను తెలంగాణకు వ్యతిరేకిని కాదు.. విభజించిన తీరుకు మాత్రమే వ్యతిరేకిని. సామాజిక తెలంగాణ రావాలని చెప్పి మరీ వచ్చాను. పార్లమెంటు తలుపులు మూసి విభజించిన తీరు తప్పని చెప్పా. తెలంగాణ వ్యతిరేకం అని వైఎస్ చెప్పినా, ఆయనకు ఊడిగం చేశారు. బెదిరింపులకు లొంగిపోయేవాడిని కాదు.. నేను ఇప్పటివరకు ఒక్క తెలంగాణ నాయకుడిని కూడా ఒక్క మాట అనలేదు. నాకు రెచ్చగొట్టడం ఇష్టంలేదు.. ఎన్నోసార్లు తగ్గి ఉన్నా. గద్దర్ బతికున్న రోజుల్లో మీరంతా ఎక్కడ ఉన్నారు? గద్దర్ వచ్చి తనకు బండి కొనివ్వాలంటే రెండు రోజుల్లో కొనిచ్చాను. గద్దర్ బతికి ఉన్న రోజుల్లో ఆయనకు మీరు ఏం చేశారు?ఒక విశ్లేషకుడి వ్యాఖ్యల వల్ల గొడవ మొదలైంది. ఆ విశ్లేషకుడిపై కేసులు పెట్టిన విషయం నాకు మొదట్లో తెలియదు. నాకు తెలిశాక కేసులు వద్దు వదిలేయమని చెప్పా. ఆ తర్వాత ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్‌లు పెట్టి నన్ను తిట్టారు. తెలంగాణలో ప్రతి సమస్యకు ఆంధ్రావారే కారణమా"

**కబ్జా నిరూపిస్తే.. ఆ భూమి రాసిచ్చేస్తా..**

"ప్రత్యేక తెలంగాణ కోరుకున్న మర్రి చెన్నారెడ్డి వల్లే సినీ ఇండస్ట్రీ చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చింది. తెలుగు ప్రజలు 50 ఏళ్లు కలిసి ఉన్న రాజధాని.. హైదరాబాద్. తెలంగాణకు అన్యాయం చేసిన పాలకులను ఉరితీసినా ఫర్వాలేదు. పాలకులు వేరు.. ప్రజలు వేరు.. పాలకులను తిట్టండి.. ప్రజలను కాదు. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో తెలుగువారు ఉన్నారు. అక్కడకి ప్రజలు మన తెలుగు ప్రజల్ని పంపిస్తే మన పరిస్థితి ఏమిటి? నేను చెరువును ఆక్రమించుకున్నానని ఆరోపణలు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గారికి చెబుతున్నా.. ఒకవేళ నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, స్వాధీనం చేసుకోండి.. రాసిచ్చేస్తా. కేసీఆర్ బీఆర్ఎస్ పెట్టి.. ఏపీకి వచ్చినప్పుడు స్వాగతించా. జనసేన మాజీ నేతలను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నా స్వాగతించా. కేవలం 2వేల మందితో సభ పెట్టుకుంటామంటే అనుమతి ఇవ్వరా? విశ్లేషకులు ఇష్టానుసారం మాట్లాడినా మా అభిప్రాయం చెప్పకూడదా? ఇలాంటి విశ్లేషకుల వల్లే కమ్యూనిజం చచ్చిపోయింది"

**తెలంగాణలో పోటీ చేస్తాం.. నేనే తిరుగుతా!**

"ఇప్పటి వరకు నిర్ణయించుకోలేదు. కానీ, మీరు అంటున్నారు గనక చెబుతున్నా. తెలంగాణలో జనసేన ఉంటుంది. మేం ఇక్కడ పోటీ చేస్తాం. అవసరమైతే తెలంగాణలో నేనే తిరుగుతాను. మేమే తిరుగుతాం. ప్రతి సమస్య మీద మాట్లాడతాం. ప్రతి అన్యాయాన్నీ ఎదుర్కొంటాం. నా తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం. మీరు బెదిరిస్తే భయపడం. తెలంగాణను వ్యతిరేకించిన వారే పదవుల్లో కూర్చొన్నారు. వ్యతిరేకించినవారే ఎమ్మెల్యేలు అయ్యారు" అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.

## చీలిక దిశగా మమత పార్టీ: బెంగాల్ మంత్రి వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

తిరుగుబాటు వర్గానికి టీఎంసీ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నాయకత్వం వహిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ పార్టీని ఐప్యాక్ హైజాక్ చేసిందని, అది ఇక మమతా బెనర్జీ (మీుఎ్మీు దీుఅవతీయవవ)ది కాదని ఈ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సుమారు 50 మంది ఎమ్మెల్యేలు మమత నాయకత్వం నుంచి బయటకు వచ్చి పార్టీ గుర్తును సొంతం చేసుకోవాలనుకుంటున్నారని పార్టీ జాతీయ ప్రతినిధి రిజుదత్తా అన్నారు. రితబ్రత బెనర్జీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కావాలని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని చెప్పారు. శోభన్‌దేబ్ చటోపాధ్యాయ ఉండాలని మమత భావిస్తున్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రితబ్రత, సందీపన్ సాహాను టీఎంసీ బహిష్కరించింది. అలాగే రిజును సస్పెండ్ చేసింది.

నేను పోరాడుతా లేకపోతే..: మమత

ఇదిలా ఉంటే.. ఎన్నికల అనంతరం తమ పార్టీ నేతలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా మమత మంగళవారం కోల్‌కతాలో భారీ ధర్నా చేపట్టారు. "నేను పోరాడుతాను లేకపోతే చనిపోతాను. ఒక వేదిక ఏర్పాటు చేసుకోవడానికి కూడా మాకు అనుమతి ఇవ్వలేదు" అంటూ ఈ సందర్భంగా బెంగాల్‌లోని భాజపా ప్రభుత్వంపై దీదీ విమర్శలు గుప్పించారు. ఇటీవల ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా రాళ్లు, గుడ్లు విసిరి దాడి చేసిన సంగతి తెలిసిందే.

## యశ్వంత్‌పుర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో తప్పిన ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

అనంతపురం జిల్లా గుత్తి రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం తృటిలో తప్పింది. జాయింట్ కప్లింగ్ ఊడి ఎస్ 6, ఎస్ 7 బోగీలు రైలు నుంచి విడిపోయాయి. దీంతో అప్రమత్తమైన లోకోపైలట్.. ఆ రైలును నిలిపివేసి చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

యశ్వంత్‌పుర్ నుంచి బిహార్‌లోని కటిహార్‌కు వెళ్లే రైలు గుత్తి రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపైకి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వెనక బోగీలు విడిపోవడాన్ని గమనించిన లోకోపైలట్ ఆ బోగీలు ఇంజిన్‌ను ఢీకొట్టకుండా నెమ్మదిగా బ్రేక్ వేసుకుంటూ ముందుకు తీసుకెళ్లారు. దీంతో నెమ్మదిగా ఆ వెనక బోగీలు ఇంజిన్ వైపు భాగాన్ని ఆనుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. మరమ్మతులు గానీ, విడిభాగాలు మార్చడం గానీ అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్లాట్‌ఫాంపై ఈ రెండు బోగీలకు లాక్ చేశారు. ప్రాసెస్ మళ్లీ చెక్ చేసుకున్న అనంతరం రైలు ముందుకు సాగింది. దీంతో దాదాపు అరగంట పాటు రైలు ఆలస్యమైంది.

## రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా కృషి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని గౌరవిస్తామని మాటిచ్చారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి మంత్రి వినిపించారు. అలాగే, హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను మంత్రి ఎగురవేశారు. హుస్నాబాద్ అంబేడ్కర్ సర్కిల్ దగ్గర జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ నంబర్ 3 ద్వారా తెలంగాణ ఏర్పాటైందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తె తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని, కోట్లాదిమంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పుకొచ్చారు. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు అభివృద్ధి సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ఉద్ఘాటించారు. తెలంగాణను ప్రజాపాలన ప్రభుత్వంలో మరింత సమానత్వంతో, మరింత ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం చేశారు.

అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ కోటి రత్నాలవీణ

మొదటిపేజీ తరువాయి

ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానేప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

# కొండాపూర్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు.. జెండా ఆవిష్కరించిన సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్

**- గ్రామ పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం**
**- అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ.. పల్లెల ప్రగతిలో సిబ్బంది పాత్ర కీలకం: సర్పంచ్ గౌతమి**




కొనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూన్ 02
కొండాపూర్ పంచాయతీ కార్యాలయంలో వైభవంగా ఆవిర్భావ ఉత్సవాలు.. తరలివచ్చిన గ్రామస్తులు కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని గ్రామ సంరక్షణలో, అభివృద్ధిలో నిరంతరం శ్రమిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల అమూల్యమైన త్యాగాలు, సుదీర్ఘ పోరాటాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, నేడు స్వరాష్ట్రంలోనే మన పల్లెలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయని కొనియాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో, పరిశుభ్రతలో పంచాయతీ సిబ్బంది, సఫాయి కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదని, వారి సేవలు అమూల్యమైనవని అన్నారు. వారి నిరంతర శ్రమను గుర్తించి, గౌరవించుకోవాలనే ఉద్దేశంతోనే ఈ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు వారిని ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలుపుకున్నట్లు వివరించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, కొండాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు అంతా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో బైక్, కారు ఢీ.. నలుగురు కుటుంబ సభ్యులకు గాయాలు, కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట మండలం /ప్రజాదివాస్ జూన్ 02






ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామ శివారులో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్లారెడ్డిపేట సబ్ ఇన్స్పెక్టర్ కె. రాహుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎండీ ఇమ్రాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో సిరిసిల్లలో ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వారి కారు పదిర గ్రామ శివారులోని రైస్ మిల్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో గంభీరావుపేటకు చెందిన అప్రోజ్ తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ఘోర ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. బాధితుడు ఎండీ ఇమ్రాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాహుల్ రెడ్డి పేర్కొన్నారు.

# వేములవాడలో తెలంగాణ సంబరాలు: అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న ఉద్యమకారుల ఫోరం

**- రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర మరువలేనిది: టీయూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

వేములవాడ/ ప్రజాదివాస్ జూన్ 02
తెలంగాణ ఆవిర్భావ వేడుకలు: అమరవీరుల సాక్షిగా ఘనంగా చైతన్య గీతాలు ఆలపించిన కళాకారులుతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద కళాకారులు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ (ఖఖీ) ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్, కళాతపస్వి యెల్ల పోశెట్టి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాకారులు అమరవీరుల స్మరార్థం ఉద్యమ గీతాలను ఆలపించి, నాటి పోరాట స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం గాయకుడు, రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ.. ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులు, ఉద్యమకారులు పోషించిన పాత్ర మరువలేనిదని ఆయన కొనియాడారు. తమ ఆట, పాటలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపి, ఉద్యమాన్ని ఉరకలెత్తించిన ఘనత కళాకారులకే దక్కుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల నాయకులు బొజ్జ కనకయ్య, కళాకారుల విభాగం న్యాయ సలహాదారులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు, దక్షిణ తెలంగాణ కోఆర్డినేటర్ వెన్నమల్ల వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు మాదాడి గజానంద రావు, వికుర్తి లక్ష్మీనారాయణ, పొత్తూరి తినిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ (×ఖీఖ) నాయకురాలు రాజేశ్వరి, రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల విభాగం అధ్యక్షులు వరాల దేవయ్య, తిరుపతి, పంజాల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరితో పాటు



సీనియర్ ఉద్యమ కళాకారులు గాజర్ల బుగ్గయ్య, పూడూరి సంజీవ్, జెదిగే రవి, సిరిసిల్ల రమేష్, బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మనవాడ లక్ష్మీనారాయణ, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నాగుల సుధాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు ఆడేపు చందు, బోయినపల్లి మండల అధ్యక్షుడు ముగిలోజీ లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి వెల్ల వెంకట నరసింహులు, చందుర్తి మండల అధ్యక్షురాలు దొంగరి లక్ష్మీరాజ్యం తదితర కళాకారులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# వేములవాడ అర్బన్ మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నంది కమాన్ చౌరస్తాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

వేములవాడ ప్రజాదివాస్ జూన్ 02



వేములవాడ అర్బన్ మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నంది కమాన్ చౌరస్తాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది ఎందరో అమరవీరుల బలిదానాల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఆనాడు పార్లమెంటులో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడం జరిగింది అని వారు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్ జింక అనిల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు ఏ రెడ్డి రాజిరెడ్డి సురువు వెంకట్, పల్లెబోయిన అంజన్న యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు సంతోష్ యాదవ్ నాయకులు కోలనూరి సంజీవరెడ్డి రెడ్డవేని రాజు పోచంపల్లి భాను తుమ్మల రాజవ్వ పల్లె బోయిన శేఖర్ పేరంగణి మల్లేశం కంసాని రాము ఎడ్ల హరీష్ మర్రిపెద్ది వికాస్ గొడుగు మహేష్ మామిళ్ల రాములు సైర్ నాథ్ చింతకుంట నరసయ్య వంగా అనిల్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 02
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం (02-06-2026) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం భీమేశ్వర సదన్‌లో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పతాకావిష్కరణ అనంతరం ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది ఈవోకి గార్డ్ ఆఫ్ ఆనర్ అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పూలమాల సమర్పణ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేసి తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన సభలో ఈవో ఎల్. రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన ఉద్యమం, అమరవీరుల త్యాగాలు, రాష్ట్రం సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# చందుర్తిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు


**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బిజెపి మండల అధ్యక్షుడు విజేందర్**

చందుర్తి మండలం/ప్రజాదివాస్ జూన్ 02




జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చందుర్తి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ జెండా గద్దె వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మార్త సత్తయ్య, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లేశం, మండల ఉపాధ్యక్షుడు మట్కా మల్లేశం, సీనియర్ నాయకులు పత్తిపాక శ్రీనివాస్, ఎగమంటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే యువ మోర్చా మండల అధ్యక్షుడు మోత్కుపల్లి రాజశేఖర్, నాయకులు మిగ్గనీ రాజేశం, మర్రి రాజు, జలగం శ్రీనివాస్, పొన్నల మహేందర్, ఏనుగుల మహేందర్ తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మద్యం తాగకుండానే మత్తెక్కించే వింత వ్యాధి




మద్యం ముట్టకుండానే రోజూ మత్తులో ఉంటున్న కెనడా వ్యక్తిని చూసి డాక్టర్లు షాకయ్యారు. అతనికి 'ఆటో-బ్రూవరీ సింద్రోమ్' అనే వింత వ్యాధి ఉన్నట్లు తేల్చారు. ఈ వ్యాధి ఉన్నవారు కార్బోహైడ్రేట్స్ తీసుకున్నప్పుడు పొట్టలోని బాక్టీరియా ఆహారాన్ని పులియబెట్టి ఆల్కహాల్గా మార్చేస్తుంది. అందుకే డ్రింక్ చేయకపోయినా మత్తుగా అనిపిస్తుంది. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహారం, యాంటీఫంగల్ మందులతో చికిత్స అందిస్తున్నారు

# వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో వైభవంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించిన చైర్మన్ పుల్కం రాజు**

**- సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**




వేములవాడ / ప్రజాదివాస్ జూన్ 02

ప్రజా పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు.. వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం స్వీకరించారు. అనంతరం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. సకల జనుల ఆకాంక్షలు, సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీదేనని కొనియాడారు. 2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం, ప్రతి ఏటా ఎంతో వైభవంగా ఉత్సవాలు జరుపుకుంటోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉద్యమకారులకు నిజమైన గుర్తింపు, గౌరవం దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రజా పాలనలో పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక ప్రజాకర్షక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సస్యశ్యామలం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కోనరావుపేట నుండి వేములవాడకు మంగళపల్లిని మార్చండి...

**మండల మార్పు కోసం ఆవిర్భావ దినోత్సవం రోజున గ్రామస్తుడి నిరసన...**

కోనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూన్ 02




తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సమయంలో ఒక వినూత్న నిరసన చోటుచేసుకుంది. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల జీవరత్నం అనే వ్యక్తి, తమ గ్రామాన్ని వేములవాడ మండలంలో కలపాలనే ప్రధాన డిమాండ్‌తో నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మంగళపల్లి గ్రామం కోనరావుపేట మండలంలో ఉంది. అయితే, తమ గ్రామం నుండి మండల కేంద్రమైన కోనరావుపేటకు వెళ్లాలంటే సుమారు 17 నుండి 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, సరైన రవాణా సౌకర్యాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీవరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, తమ గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోనే వేములవాడ పట్టణం అందుబాటులో ఉందని, పరిపాలనా సౌలభ్యం కోసం తమ గ్రామాన్ని వేములవాడ మండలంలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తమ గ్రామాన్ని వేములవాడలో కలిపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆవిర్భావ దినోత్సవం రోజున ఫ్లెక్సీ పట్టుకుని ఆయన చేసిన నిరసన ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.

# అమరవీరుల త్యాగాలు, కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాకారం: బీఆర్ఎస్ ఇంచార్జ్ చల్మెడ

**- తెలంగాణ చౌక్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**



వేములవాడ /ప్రజాదివాస్ జూన్ 02

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల ఉజ్వల త్యాగాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాగించిన అలుపెరగని పోరాటం వల్లే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల సుపరిపాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర పాలకులు మళ్లీ నీళ్ల దోపిడీకి తెరలేపుతూ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మల్కపేటలో మువ్వన్నెల జెండా ఎగురవేసి, అమరవీరులకు నివాళు లర్పించిన సర్పంచ్ దేవరాజు



కోనరావుపేట మండలం ప్రజాదివాస్ జూన్ 02

అమరవీరుల త్యాగాల ఫలమే తెలంగాణ: మల్కపేట గ్రామ ప్రగతికి అందరూ కలిసికట్టుగా సాగాలన్న సర్పంచ్ బోయిని దేవరాజు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సర్పంచ్ బోయిని దేవరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని, మల్కపేట గ్రామ ప్రగతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- అమరులకు నివాళులర్పించిన జర్నలిస్టులు**

**- బైక్ ర్యాలీతో హోరెత్తించిన ఁఖఔజీ యూనియన్ సభ్యులు**




వేములవాడ మండలం / ప్రజాదివాస్ జూన్ 02

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీయూడబ్ల్యూహెచ్143 వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళ వారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మూడు రంగుల జెండాను అధ్యక్షులు నరసయ్య ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారులలో బైక్ ర్యాలీతో జర్నలిస్టులు హోరెత్తించారు. మార్కెట్ యార్డ్ నుండి తెలంగాణ చౌక్, పోలీస్ స్టేషన్, సుభాష్ నగర్, బైపాస్ రోడ్, తిప్పాపురం తెలంగాణ తల్లి విగ్రహం నుండి అమరవీరుల స్తూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. జై తెలంగాణ.. జై జై తెలంగాణ నినాదాలతో ప్రాంతం దద్దరిల్లేలా నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ యూనినార్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసయ్య, ప్రధాన కార్యదర్శి అలీలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. సకలజనులతో మమేకమై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ఘనత జర్నలిస్టులకు దక్కిందన్నారు. మాజీ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సారథ్యంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమం ఉధృతం చేసిన ఘనత జర్నలిస్టులకు అంకితమన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

# రుద్రవరంలో జాతీయ జెండా ఆవిష్కరించిన సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి

వేములవాడ/ప్రజాదివాస్ జూన్ 02



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని, రుద్రవరం గ్రామ ప్రగతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా ఆమె స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**- జండా ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ వి. విజయలక్ష్మి**

ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి జెండాను ఆవిష్కరించి జై తెలంగాణ జై జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ సాధించిన ప్రగతిని అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ జరుపుకునే పండుగ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాయపకేతర బృందం పాల్గొన్నారు



# వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో వైభవంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించిన చైర్మన్ పుల్కం రాజు**

**- ప్రజా పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు.. వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**

ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం స్వీకరించారు. అనంతరం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. సకల జనుల ఆకాంక్షలు, సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీదేనని కొనియాడారు. 2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం, ప్రతి ఏటా ఎంతో వైభవంగా ఉత్సవాలు జరుపుకుంటోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉద్యమకారులకు నిజమైన గుర్తింపు, గౌరవం దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రజా పాలనలో పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక ప్రజాకర్షక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సస్యశ్యామలం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అమరుల త్యాగాలు బావి తరాలకు స్ఫూర్తిదాయకం

**ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సునీల్**

ప్రజాదివాస్

గన్నేరువరం మండల కేంద్రంలో మంగళవారం రోజున తెలంగాణ



రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గన్నేరువరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బొడ్డు సునీల్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాల భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, మాజీ ఉప సర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపోల్ నవీన్, పాకాల పరశురాం, సతీష్ రెడ్డి, మైసంపల్లి తిరుపతి, బుర్ర తిరుపతి గౌడ్, నక్క అంజయ్య, నరేందర్ న్యాత శ్రీనివాస్, విద్యాసాగర్ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

ప్రజాదివాస్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణంలోని టవర్ సర్కిల్‌లో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి మాట్లాడుతూ, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని, వారి త్యాగాలను స్మరించుకుంటూ నవతెలంగాణ నిర్మాణంలో శ్రీనివాసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో దాహంతో



అలమటిస్తున్న ప్రయాణికులు, భక్తులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, భక్తులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. “ప్లాస్టిక్ రహిత కరీంనగర్” అనే నినాదంతో పేపర్ గ్లాసుల్లో మజ్జిగ పంపిణీ చేయడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 2,500 మందికి పైగా దాహార్తిని తీర్చగా, మజ్జిగ సేవించిన వారు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరితో పాటు సభ్యులు గట్టు శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, పడకంటి శ్రీనివాస్, సామ శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, తొడుపునూరి శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, అవధూత శ్రీనివాస్, పడమటింటి శ్రీనివాస్, చెన్నాడి శ్రీనివాస్, ఇజ్జగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు.

ప్రజాదివాస్

బిజెపి ఆధ్వర్యంలో మొదటగా పార్టీ ఆఫీసులో ప్రతాప రామకృష్ణ చేతుల మీదుగా జెండా ఎగరవేసుకొని తదుపరి 12 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 12 జాతీయ జెండాలను భీమేశ్వర రిసార్ట్స్ వద్ద బిజెపి కౌన్సిలర్స్ రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ వందల మంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణను ఇప్పటివరకు స్వార్థపరుల చేతికి పగ్గాలు ఇవ్వడం జరిగింది రానున్న ఎన్నికలలో దేశం కోసం ధర్మం కోసం పాటుపడే బిజెపి నీ ఆదరించి తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త అంకితభావంతో తెలంగాణకు బిజెపి పగ్గాలు చేపట్టేలా ఉద్యమించాలని అన్నారు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి తెలంగాణ ఉద్యమంలో అంకితభావంతో నరేంద్ర మోడీ సారథ్యం సుష్మా స్వరాజ్ పోరాటం మరువలేనిది అన్నారు ప్రతి ఒక్కరు కూడా తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు కొరకు బిజెపి పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా అందరికి స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ రాష్ట్ర ఓఎ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ మల్లేశం కృష్ణస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్ వైభవ్ బాలరాజ్ బండ మల్లేశం కౌన్సిలర్స్ మైలారం శ్రీనివాస్,,



నాయకులు పిన్నింటి హనుమన్లు వివేక్ రెడ్డి బిల్లా కృష్ణ బోనాల శివ మామిండ్ల లక్ష్మిరాజశీ మల్లేశం యాదవ్ దూలేబషా కట్కం శ్రీనివాస్ నామాల శేఖర్ సగ్గు రాహుల్ పోతారం సాయి లాలా శేఖర్ నేరేళ్ల సాయి, కిరణ్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు

# గన్నేరువరం పోలీస్ స్టేషన్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**గన్నేరువరం ఎస్సై జి నరేందర్ రెడ్డి**

ప్రజాదివాస్

గన్నేరువరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సై జి నరేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కోసం జరిగిన శాంతియుత ఉద్యమంలో శాంతి భద్రతలను కాపాడుతూ కీలకపాత్ర పోషించిన పోలీసు వ్యవస్థ సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# గంభీరావుపేట బిజెపి కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు

**- జెండా ఆవిష్కరించిన బిజెపి మండల అధ్యక్షుడు కోడె రమేష్**

ప్రజాదివాస్

భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం పై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ గర్వం... తెలంగాణ ఆత్మగౌరవం దశాబ్దాల మరియు ఆనాడు పార్లమెంటులో తెలంగాణ బిల్ పాస్ చేయడానికి ప్రతిపక్షరాలు శ్రీమతి శ్రీ స్వర్గీయ సుష్మా స్వరాజ్ గారు పార్లమెంటులో అందర్నీ ఒప్పించి తెలంగాణ బిల్లు పాస్ చేయించినటువంటి ఆమె గొప్పతనం వల్లే ఈరోజు తెలంగాణ ఏర్పడ్డది .



మరియు సకలజనుల పోరాట ఫలితంగా సాధించిన ఈ స్వరాష్ట్రం, వీరుల త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. ప్రతి తెలంగాణ బిడ్డ హృదయంలో నిలిచిన ఈ రోజు,మన ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గర్వదినం అభివృద్ధి, ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం ఇంకా ఎత్తులకు ఎదగాలని ఆకాంక్షిస్తూ...తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ రాజు పత్తి స్వామి డాక్టర్ సత్యనారాయణ సర్వోత్తమ్ అంజన్ రావు దేవేందర్ యాదవ్ తిరుపతి నర్సింలు శ్రీనివాస్ చారి దేవా గౌడ్ మల్లేష్ గౌడ్ స్వామి నరేష్ నవీన్ శ్రీనివాస్ ఎల్లం చంద్రం యాదవ్ రాజేష్ నాయకులు పాల్గొన్నారు .

# అమరవీరుల ఆశయాల సాధనే లక్ష్యం

**– గన్నేరువరం బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్**

ప్రజాదివాస్

జూన్ 2, తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటం, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలం. ఎందరో యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న స్వరాష్ట్రమే తెలంగాణ అని, . ఈ చారిత్రాత్మకమైన రోజున తెలంగాణ ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు బిజెపి గన్నేరువరం మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ తెలిపారు. బిజెపి గన్నేరువరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున గన్నేరువరం మండల కేంద్రం లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ జాతీయ జెండాను ఎగరవేసి మాట్లాడారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భారతీయ జనతా పార్టీ పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. 1997లోనే కాకినాడ తీర్మానంలో ఒక ఓటు – రెండు రాష్ట్రాలు అని ప్రకటించి, తెలంగాణ డిమాండ్‌కు జాతీయ స్థాయిలో పూర్తి రాజకీయ మద్దతునిచ్చిన ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు. నాడు పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ గారు చిన్నమ్మ గా తెలంగాణ బిల్లు పాస్ కావడానికి పోషించిన పాత్రను ఈ గడ్డ ఎన్నటికీ మరవదన్నారు. నాడు బీజేపీ అండగా నిలబడకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిల్లును ఆమోదించేదే కాదన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కొందరి కుటుంబ స్వార్థం కోసం కాదు, అమరవీరుల ఆశయాల కోసం. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో సాగిన ఉద్యమంలో యువత, విద్యార్థులు ప్రాణాలు అర్పించారు కానీ, గత12 ఏళ్లలో ఆ ఆశయాలు ఎంతవరకు నెరవేరాయో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ నిరాశ, పేదరికం, అవినీతి వల్ల తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తోందన్నారు.జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఎయిమ్స్ లాంటి సంస్థలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందన్నారు.



తెలంగాణను నిజమైన బంగారు తెలంగాణ గా మార్చడం, అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం, యువతకు ఉపాధి కల్పించడమే బీజేపీ ధ్యేయం అని తెలిపారు.అమరవీరుల ఆశయాలు నెరవేరాలన్నా, తెలంగాణలో నిజమైన ప్రజాస్వామ్య పాలన రావాలన్నా అది కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి విలాసాగరం రాంచంద్రం గాలి పల్లె శంకర్ పుల్లెల రాము, పుల్లెల జగన్, మచ్చ సాయి కృష్ణ, జిల కుమార్ యాదవ్ టేకు అనిల్, ఎలేటి శ్రీకాంత్ రెడ్డి, భూమాడి సురేందర్,తిప్పర్తి వెంకటేశం,సిరిగిరి తిరుపతి, దొగలీ జగన్, కొంకటి రవి, గూడూరి జగన్, బుర్ర సతయ్య, గంట గౌతమ్, బొమ్మకంటి శ్రీనివాస్, వేధిర చంటి పాల్గొన్నారు....

# సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు:


**– జాతీయ జెండాను ఆవిష్కరించిన సీపీ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్.**

ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి సిపి రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.. ఎంతోమంది త్యాగాలు, సుదీర్ఘ పోరాటం తర్వాతే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. తెలంగాణ సాధన కోసం జరిగిన శాంతియుత ఉద్యమంలో శాంతిభద్రతలను కాపాడుతూ కీలక పాత్ర పోషించిన పోలీసు వ్యవస్థ సేవలు ఎప్పటికీ మరువలేనని, పోలీస్ శాఖ అనేది అత్యంత క్రమశిక్షణతో కూడిన బలగమని , ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది ఆ క్రమశిక్షణను నిరంతరం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మనం ధరించే యూనిఫాం, సమాజం మనపై ఉంచిన బాధ్యతకు మరియు నమ్మకానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఖాకీ యూనిఫాం యొక్క గౌరవాన్ని, ప్రతిష్టను కాపాడేలా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధి నిర్వహణ చేపట్టాలని సూచించారు.





ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ , అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబాబు , ఇన్‌స్పెక్టర్లు మరియు కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఎం నుండి మల్లారపు అరుణ్ కుమార్ బహిష్కరణ

వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ బూర్జువా పార్టీ ప్రలోభాలకు తలొగ్గి ఆర్థిక అవకాశవాదంతో వ్యవహరించడం వల్ల ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు మంగళవారం సిరిసిల్ల బి వై నగర్ లోని అమృత లాల్ శుక్లా భవన్ లో సిపిఎం జిల్లా కమిటీ అత్యవసర సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ అధ్యక్షతన జరిగింది ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ గత కొంతకాలంగా మల్లారపు వరుణ్ కుమార్ బిఆర్ఎస్ ఆర్థిక ప్రలోభాలతో పార్టీని మండలంలో లేకుండా చేయాలని నానా రకాలుగా ప్రయత్నాలు చేశాడని దానిపై పలుమార్లు సర్ది చెప్పినప్పటికీ వినిపించుకోలేదన్నారు సిపిఎం తనను ఎంపీటీసీగా సర్పంచిగా పార్టీ నాయకుడిగా అంచలంచెలుగా ఎదగటానికి దోహదం చేసిందన్నారు. ఇకమీదట మల్లారపు అరుణ్ కుమార్ కు సిపిఎం పార్టీ ప్రజా సంఘాలకు ఎటువంటి సంబంధం ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగబంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య. ఎర్రవెల్లి నాగరాజు. మల్లారపు ప్రశాంత్ అన్నల్దాస్ గణేష్ ముక్తి కాంత అశోక్ సూరం




పద్మ గురజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు మూషం రమేష్ సిపిఎం జిల్లా కార్యదర్శి రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ తేది. 02.06.2026

# చేర్యాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు..

ప్రజాదివాస్

హైకోర్టు ఆదేశాల మేరకు చేర్యాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బానోతు శ్రీరామ్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థ తరపున ప్రజలకు నిరంతరం పారదర్శకమైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అనంతరం చేర్యాల సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. అపూర్వ రెడ్డి తమ పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ పతాకానికి, న్యాయమూర్తికి ఘనంగా గౌరవ వందనం (సెల్యూట్) సమర్పించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అరెళ్ల వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీ సుద్దాల రమేష్, ఇతర సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మరియు అబ్కారి (ఎక్సైజ్) శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.











## చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ముస్తాల అరుణ బాల్ నరసయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు




## చేర్యాల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దిలీప్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.





ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే జాతీయ జెండాను ఎగురవేసి జిల్లా ప్రజలకు,పోలీస్ అధికారులకు,సిబ్బందికి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి,భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ప్రజల భద్రత, శాంతి పరిరక్షణ కోసం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,ఏ.ఓ పద్మ,సి.ఐ శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్,రవీందర్,మొగిలి,రవి, ఆర్.ఐ లు మధుకర్, సురేష్, ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం మీరుదొడ్డి .

ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం లో భాగంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి టౌన్ ప్రెసిడెంట్ మద్దెల సుదర్శన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చెన్నై భూపాల్ గౌడ్ నాయకులు నేరండ్ల భూమాగౌడ్ రంగమైన రామకృష్ణ ఏరోళ్ల నర్సింలు అల్లిబిల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు



TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
బుధవారం 03-06-2026

## శ్రీవాణి స్కూల్ ముస్తాబాద్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు




ప్రజాదివాస్
శ్రీ వాణి స్కూల్ ముస్తాబాద్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ ఎందరో విద్యార్థులు ప్రాణాలు అర్పించి తెలంగాణ సాధించారన్నారు వారి ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా ఇవాళ అర్పించారు ఎందరో ప్రాణాలు అర్పించి సాధించిన తెలంగాణలో బంగారు తెలంగాణకు బాటలు వేయాలన్నారు ప్రతి మనిషి కూడా తనతోపాటు అందరూ కూడా బాగుండా తెలంగాణ రాష్ట్రంలో కార్మికులు కర్షకులు విద్యార్థులు అందరు కూడా బాగుండాలని ఈ సందర్భంగా అందరికి కూడా తెలంగాణ రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## గ్రామాల్లో పలు పూజా కార్యక్రమాలు పాల్గొన్న చేరుకు శ్రీ నివాస్ రెడ్డి.



ప్రజాదివాస్
సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి దుబ్బాక మండలంలోని శిలజీ నగర్, పోతారం, పెద్ద చికోడ్, గ్రామాలలో జరిగే పలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఈ సందర్భంలో:**

1. శ్రీ బీరప్ప దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రజలందరూ ఆయురారోగ్యాల తో ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. 2. పోతారం గ్రామంలో నంది ఎల్లమ్మ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. 3. పెద్ద చీకోడ్ గ్రామంలో గౌడ సంఘం వారు నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ చతుర్ధ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నరు.

## బిఆర్ఎస్ నాయకులు కొమ్ము రాజు అత్తామామల మృతి.

**- నివాళులర్పించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.**

ప్రజాదివాస్
జనగామ మండల బిఆర్ఎస్ యువజన నాయకులు కొమ్ము రాజు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన అత్తమ్మ, మామ అయిన బోట్ల ప్రమీల బిక్షపతి దంపతులు అనారోగ్యంతో మృతి చెందారు.




ఈ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి చిటకోడూరు గ్రామానికి వెళ్లారు. ప్రమీల బిక్షపతి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరు పెద్దలు ఇలా అనారోగ్యంతో మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు కొమ్ము రాజును, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. వారికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చా రు.

# సైక్లింగ్ ఆరోగ్యానికి, పర్యావరణానికి శ్రేష్టం

**- సైకిల్ తొక్కుదాం.. ఆరోగ్యంగా జీవిద్దాం**
**- జూన్ 3: ప్రపంచ సైకిల్ దినోత్సవం**






ప్రజాదివాస్
సైకిల్ ను సామాన్యుడి వాహనంగా పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జూన్ 3 న ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకుంటారు. సైకిల్ తొక్కితే ఆరోగ్యానికి, పర్యావరణానికి కలిగే లాభాలు వివరిస్తూ ప్రపంచవ్యాప్తంగా సైకిల్ దినోత్సవం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో చాలామంది తమ లైఫ్ స్టైల్ ని చాలా లేజీగా మార్చేసుకుంటున్నారు. గతంలో బైకులు, కార్ల కు బదులుగా తమ అవసరాల కోసం సైకిల్ పై వెళ్లేవారు. ఇప్పుడు ఇంటి దగ్గరలో దుకాణం ఉన్నా బైక్ పైనే వెళ్లే పరిస్థితి కనిపిస్తుంది. ఇది ఆరోగ్యానికే కాదు పర్యావరణానికి కూడా అంత మంచిది కాదు. ఈ విషయాన్ని గుర్తిస్తూ సైకిల్ పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని తెరపైకి తెచ్చారు. ప్రతి సంవత్సరం జూన్ 3వ, తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సైకిల్ దినోత్సవాన్ని తుర్కమెనిస్తాన్ దేశం ముందుకు తీసుకురాగా, సైకిల్ తో ప్రయాణం సులభమైన, చౌకైనా, పర్యావరణానికి, ఆరోగ్యానికి అనుకూలమైన ప్రయాణ సాధనంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. 2018 లో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆ సమయంలో 193 కు పైగా దేశాలు ప్రపంచ సైకిల్ దినోత్సవానికి మద్దతునిచ్చాయి. జర్మనీకి చెందిన బారన్ కార్ల్ వాన్ డ్రైస్ 1817 లో మొదటిసారి సైకిల్ ను తయారు చేశారు. దీనిని డాండీ హార్స్ లేదా లాఫ్ మా షైన్ అని పిలిచేవారు. బ్రిటిష్ వారి కాలంలో భారత్ లోకి సైకిల్ వచ్చింది. అప్పటి నుంచి ఇది రవాణా, క్రీడలు, వినోదం లాంటి వివిధ మార్గాల్లో ప్రజాదారణ పొందింది. 2024 డిసెంబర్ నాటికి సైకిళ్లను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం చైనా. చైనాలో సైకిల్ వాడకం తక్కువగానే ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం సైకిళ్లలో 60 శాతానికి పైగా ఆ దేశం తయారు చేసినవే. 58 శాతానికి పైగా జనాభాతో సైకిళ్లను ఎక్కువగా వినియోగిస్తున్న దేశంగా నెదర్లాండ్స్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ దేశం ప్రజలు సైక్లింగ్ ను తమ సంస్కృతిలో భాగంగా చూడటమే ఇందుకు కారణం. తర్వాతి స్థానాల్లో వరుసగా బెల్జియం, ఫ్రాన్స్, బ్రిటన్, ఐర్లాండ్, ఫిన్లాండ్, జర్మనీ దేశాలు ఉన్నాయి. సైకిళ్ల వాడకంతో కాలుష్యం, ట్రాఫిక్ తగ్గుతుంది. సురక్షితమైన పర్యావరణానికి తోడ్పాటు అందిస్తుంది. చౌక ధరలో ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. శారీరకంగా, ఆరోగ్యంగా ఉండేందుకు సైక్లింగ్ సహాయపడుతుంది. కాబట్టి రోజులో కనీసం కాసేపు సైక్లింగ్ చేస్తే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు అనే ప్రాముఖ్యతలను ఇది తెలియజేస్తుంది.. సైక్లింగ్ చేస్తే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు అందుతాయి. అందుకే జిమ్ లో కూడా సైకిల్ ని ఉంచుతారు. కార్డియోలో భాగంగా చాలామంది సైక్లింగ్ చేస్తారు. బయటకు వెళ్లి తొక్క లేనివారు ఇంట్లోనే ఈ సైక్లింగ్ ను చేయవచ్చు. ఇది రక్తప్రసరణను మెరుగుపరిచి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటు సమస్యలను దూరం చేస్తుంది. కండరాలకు బలం చేకూర్చి కండర సామర్థ్యాన్ని పెంచుతుంది. కాళ్లకు, హిప్స్ కు, తొడలకు బలాన్ని అందిస్తుంది. కీళ్ల పనితీరు మెరుగడంతో పాటు బరువు తగ్గడంలో కూడా సహాయం చేస్తుంది. శరీరంలోని కేలరీలు బర్న్ చేయడానికి సైక్లింగ్ మంచి ఎంపిక. మానసిక సామర్థ్యాన్ని పెంచుతుంది. చెడు కొవ్వుని తగ్గించడంలో సహాయం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జైటీ సమస్యలు దూరం అవుతాయి. ఎండార్ఫిన్స్ విడుదల చేసి మూడ్ ను మెరుగుపరుస్తుంది. నిద్ర సమస్యలు కూడా తగ్గుతాయి. మెరుగైన నిద్ర అందుతుంది. ఏ వయసు వారైనా సైక్లింగ్ ను తమ దినచర్యలో చేర్చుకోవచ్చును. మానవ శక్తితో నడిచే అతి చౌకైన పర్యావరణహితమైన మరియు ఆరోగ్యకరమైన రవాణా సాధనం సైకిల్. ఇది కేవలం ప్రయాణానికి మాత్రమే కాకుండా శరీర దృఢత్వానికి, కాలుష్య నియంత్రణకు ఎంతో మేలు చేస్తుంది. సైక్లింగ్ ఒక అద్భుతమైన ఏరోబిక్ వ్యాయామం. ఇది గుండె జబ్బులను నివారిస్తుంది. కండరాలను ధ్రుఢపరుస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది మరియు బరువు తగ్గడానికి ముఖ్యంగా కొవ్వు కరిగించడానికి చాలా బాగా పనిచేస్తుంది. ఇది ఎలాంటి కాలుష్యం సృష్టించదు. వాతావరణంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సైకిల్ పాత్ర ఎంతో కీలకం. దీనికి ఇంధనం (పెట్రోల్, డీజిల్)అవసరంలేదు. దీనికి నిర్వహణ ఖర్చు చాలా తక్కువ. ఆర్థిక భారం తక్కువ. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న నగరాల్లో సైకిల్ ప్రయాణం చాలా సులభం మరియు సమయాన్ని ఆదా చేస్తుంది. ఎన్నికైన సందుల్లో కూడా సులభంగా వెళ్లవచ్చు. ఉదయాన్నే సైకిల్ తొక్కడం వల్ల ఒత్తిడి ఆందోళన తగ్గి మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఉపయోగించే ప్రదేశాన్ని బట్టి సైకిల్స్ లో వివిధ రకాలు అందుబాటులో ఉన్నాయి. రోడ్ బైక్స్ సున్నితమైన రోడ్లపై వేగంగా ప్రయాణించడానికి అనుకూలంగా ఉంటాయి. మౌంటెన్ బైక్స్ గుంతలు, మట్టి రోడ్డు మరియు కొండ ప్రాంతాల్లో ప్రయాణించడానికి (ఆఫ్ లోడింగ్ )ప్రత్యేక టైర్లు, సస్పెన్షన్ తో ఉంటాయి. హైబ్రిడ్ బైక్స్ ఇవి మౌంటెన్ మరియు రోడ్ బైక్స్ ల కలయిక . సాధారణ ప్రయాణాలకు మరియు లాంగ్ రైడ్స్ కు అనుకూలం. ఎలక్ట్రిక్ బైక్స్ బ్యాటరీ సహాయంతో పనిచేస్తాయి. ఎక్కువ దూరం ప్రయాణించేటప్పుడు ఫెదరల్ తొక్కే శ్రమను తగ్గిస్తాయి. సైకిల్ ను సామాన్యుడి వాహనంగా పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జూన్ 3 న ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకుంటారు. మీరు ఫిట్ నెస్ కోసం, పర్యావరణం కోసం మీ లైఫ్ స్టైల్ లో సైకిల్ ని చేర్చుకోవాలనుకుంటే మంచిదే. అయితే మీరు దీనిని వాడే ముందు వైద్యుల సలహాలు తీసుకోండి. మీ ఆరోగ్యం, జీవనశైలిని బట్టి వారు మీరు సైకిల్ ని వాడవచ్చు లేదో చెప్తారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు అనుకునేవారు సైకిల్ ని ప్రశాంతంగా వాడుకోవచ్చు. సైక్లింగ్ ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో శ్రేష్టం. కాబట్టి సైకిల్ తొక్కుదాం.. ఆరోగ్యంగా జీవిద్దాం. విక్కుర్తి లక్ష్మీ నారాయణ ప్రధానోపాధ్యాయుడు

# గన్నేరువరంలో ముగ్గురు కానిస్టేబుల్ లకు ప్రతిష్టాత్మక సేవ పథకం

ప్రజాదివాస్
గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళు ్లగా విధులు నిర్వహిస్తున్న ఈర్ల తిరుపతి,సముద్రాల రామచంద్రంలు ప్రతిష్టాత్మక సేవా పథకం అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మరియు విధి నిర్వహణలో వారు కనబరిచిన అద్భుతమైన ప్రతిభకు, నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా వీరు అత్యంత వైభవంగా ఈ సేవా పథకాలను అందుకున్నారు. గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఈర్ల తిరుపతి, సముద్రాల రామచంద్రంలు తమ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణలో మరియు కేసుల దర్యాప్తులో వీరు చాటిన చొరవను ఉన్నతాధికారులు గుర్తించారు. మంత్రి, సిపిల చేతుల మీదుగా పురస్కార ప్రదానం కరీంనగర్‌లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి ,కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా ఈర్ల తిరుపతి, రామచంద్రంలకు సేవా పథకాలను అందజేసి, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో కమిషనరేట్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఈ ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు సేవా పథకం దక్కడం పట్ల గన్నేరువరం సబ్ ఇన్స్పెక్టర్ మరియు తోటి పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం తమ బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తామని పురస్కార గ్రహీతలు తిరుపతి, రామచంద్రం ఈ



సందర్భంగా పేర్కొన్నారు.





**సోమిడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయంలో డాక్టర్ కర్రోల్ల అనిత జాతీయ జెండా ఆవిష్కరించారు.**

TGTEL/25/A0827




# చికాకుగా అనిపించినా.. వాస్తవమిదే!: మాధురి దీక్షిత్

"మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశమిస్తున్నారా?" అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రీ, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ... "ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే" అన్నారు.

త్రిప్తి మాట్లాడుతూ.. "ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడిపెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది" అని అంది త్రిప్తి.




# పెద్దిలో స్పోర్ట్స్‌కే ప్రాధాన్యం హీరో రామ్‌చరణ్

జరామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని విడుదల దగ్గర పడుతుందడడంతో సోషల్ మీడియాలో రోజుకో వార్త వైరల్ అవుతోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లోని సూపర్ హిట్ సాంగ్ 'అబ్బనీ తియ్యనీ దెబ్బ'ను ఇందులో రీక్రియేట్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ దీనిపై స్పందించారు. మీరు కొన్ని విషయాలు బిగ్‌స్క్రీన్ మీద చూసి తెలుసుకోవాలి. మేం ఆ పాటను రీక్రియేట్ చేయలేదు. కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. అలాంటివి అన్నీ యాడ్ చేస్తే ఇది మరీ కమర్షియల్ సినిమా అవుతుంది. అది ఐకానిక్ సాంగ్' అని చరణ్ అన్నారు. ఇక 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. 'క్రీడలపై పూర్తి ఫోకస్‌తో ఉంటూ వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు దీన్ని కచ్చితంగా చూడాలి. థియేటర్ నుంచి భావోద్వేగంతో బయటకు వస్తారు. వీక్ మైండ్ ఉన్నవాళ్లు కూడా చాలా స్ట్రాంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. జీవితంలో అత్యంత కష్టమైన సమయాలను ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై స్పష్టమైన ఆలోచన వస్తుంది. మనకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా జీవితం ముందుకు సాగిపోవాలి అని 'పెద్ది' మనకు నేర్పుతాడు. ఈ జనరేషన్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయమిదని రామ్ చరణ్ తెలిపారు. ఇక, తండ్రి చిరంజీవిని చూసి ఎంతో స్ఫూర్తి పొందానని రామ్ చరణ్ చెప్పారు. ఆయన లేకపోతే తన జీవితమే లేదన్నారు. బాబాయ్ పవన్ కల్యాణ్‌ను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు.

# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా




గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పుకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.


# వ్యక్తిత్వ హననం చేసే ట్రోల్స్

## ట్రోల్ చేస్తున్న వారిపై మాధురి మండిపాటు

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రీ, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు.



ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే' అన్నారు. త్రిప్తి మాట్లాడుతూ.. 'ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడిపెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది' అని అంది త్రిప్తి.



# అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.

# పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

